సాక్షి ఖమ్మం

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



తేమ ప్రామాణికంగా కొనుగోళ్లు

'సాగు-బాగు'లో భాగంగా రైతుల కల్లాల వద్దే తేమ శాతం ఆధారంగా మిర్చి కొనుగోళ్లు చేసేందుకు సిద్ధమయ్యారు. IIలో



'ప్రాంగణం' విద్యార్థుల ప్రతిభ

మహిళా ప్రాంగణంలోని ఎంపీహెచ్‌డబ్ల్యూఓ విద్యార్థులు ప్రథమ సంవత్సరం పరీక్షల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. IIలో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 35°/ 17°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయిలో నమోదయ్యే అవకాశముంది రాత్రి మాత్రం చలిగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

భద్రాద్రి జిల్లాలో సీసీ రోడ్లకు రూ.1.17 కోట్లు

- ఎంపీ నామ నాగేశ్వరరావు వెల్లడి



ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా నిధులు కేటాయిస్తున్నట్లు బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి గాను సీసీరోడ్ల నిర్మాణం కోసం రూ.1,17,50,500 మంజూరు చేసినట్లు వెల్లడించారు. భద్రాద్రి జిల్లాలోని మారుమూల గ్రామాల అభివృద్ధిని పరిగణనలోకి తీసుకుని ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల ఆధారంగా నిధులు కేటాయించినట్లు చెప్పారు. అశ్వారావుపేట, చంద్రుగొండ, దమ్మపేట, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాలకు చెందిన గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, కల్వర్టులు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్ల ప్రహరీ నిర్మాణానికి ఈ నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు భద్రాద్రి జిల్లాలో గ్రామాలభివృద్ధికి ఎంపీ నిధులు భారీగా కేటాయిస్తుండగా, త్వరలోనే పనులకు శంకుస్థాపన చేస్తామని ఎంపీ నాగేశ్వరరావు వెల్లడించారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



పోలీస్‌స్టేషన్‌లో పరిశీలిస్తున్న సీపీ

కల్లూరు: పోలీసులు అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని పోలీస్ కమీషనర్ సునీల్‌దత్ సూచించారు. కల్లూరు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేసిన ఆయన రికార్డులు పరిశీలించి స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరు వ్యవహరిస్తే ఉపేక్షించవద్దని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా వేయాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈకార్యక్రమంలో కల్లూరు ఏసీపీ రఘు, సీఐ వెంకటేష్, ఎస్‌ఐ షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

- ఖమ్మం ఏసీపీ రమణమూర్తి

ఖమ్మంక్రైం: అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపడమే కాక శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఖమ్మం నగర ఏసీపీ రమణమూర్తి తెలిపారు. ఏసీపీగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ విస్తృతంగా పెట్రోలింగ్ చేపట్టడంతో పాటు గస్తీ ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు. కాగా, చిన్నపిల్లల కిడ్నాప్ ముఠా తిరుగుతోందని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పుకార్లు నమ్మకుండా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అంతేతప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, ఏసీపీ రమణమూర్తి బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీపీ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌గా సంపత్‌కుమార్



కమిషనర్ ఆదర్శ్‌కు మొక్క అందజేస్తున్న ఏసీ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఏ.సంపత్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న బి.సత్యనారాయణరెడ్డిని రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేయగా, నల్లగొండ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సంపత్‌కుమార్‌ను కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌గా కేటాయించారు. ఈసందర్భంగా శుక్రవారం విధుల్లో చేరిన ఆయన కమిషనర్ ఆదర్శ్ సురభిని మర్యాదపూర్వకంగా కలవగా.. ఉద్యోగులు సంపత్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



బస్టాండ్ వద్ద నిరసన సభలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



ఖమ్మం కమాన్‌బజార్‌లో మూసివేసిన దుకాణాలు



వాహనదారులను అడ్డుకుంటున్న నిరసనకారులు



బస్సులు లేక బోసిపోతున్న ఖమ్మం పాత బస్టాండ్

సకలం బంద్ !

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలను అవలంబిస్తుందని ఆరోపిస్తూ దేశవ్యాప్తంగా శుక్రవారం చేపట్టిన గ్రామీణ బంద్, కార్మికుల సమ్మె జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. అఖిలపక్ష రాజకీయ పార్టీలు, సంఘాల ఆధ్వర్యాన బంద్ చేపట్టగా, విద్యా, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. అలాగే, ప్రభుత్వ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకాగా, ప్రభుత్వ కార్యాలయాల్లో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. సీపీఎం, సీపీఐ, ప్రజాపంథా, న్యూడెమోక్రసీ, కాంగ్రెస్‌తోపాటు సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, బీఆర్‌ఎస్‌కేవీ నాయకులు బంద్‌లో పాల్గొన్నారు.

– ఖమ్మంమయూరిసెంటర్

జిల్లాలో ప్రశాంతంగా సమ్మె

- అఖిలపక్షం ఆధ్వర్యాన పలుచోట్ల రాస్తారోకో
- డిపోల నుంచి బస్సులు రాకుండా ఆందోళన
- ఆర్టీసీకి రూ.60లక్షల మేర నష్టం
- తెరుచుకోని దుకాణాలు, మూతపడిన విద్యాసంస్థలు, పెట్రోల్‌బంక్‌లు

రాస్తారోకో.. ప్రదర్శన

పార్టీలు, సంఘాల నాయకులు తెల్లవారుజామునే ఆర్టీసీ డిపోల వద్దకు చేరుకుని బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. అనంతరం ర్యాలీలు నిర్వహించి అక్కడికక్కడా తెరిచిన దుకాణాలను మూసివేయించారు. ఆర్టీసీ అధికారులు దూర ప్రాంత సర్వీసులను ముందుగానే రద్దు చేయగా, అత్యవసర పనులు ఉన్న వారు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. అయితే, నిరసనకారులు వీటినీ అడ్డుకోవడంతో ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఇక పెట్రోల్ బంక్‌లు మూతపడ్డాయి. కాగా, శుక్రవారం ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఖమ్మం రూరల్ మండలం కాశిరాజుగూడెంలో హాల్‌టికెట్లు చూపించినా ఆందోళనకారులు అనుమతించకపోవడంతో విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆతర్వాత స్థానికులు సర్దిచెప్పడంతో విద్యార్థులను పంపించారు.

నిలిచిన బస్సులు

జిల్లావ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. తెల్లవారుజామున ఐదు గంటలకే ఖమ్మం డిపో ఎదుట సీపీఎం, సీపీఐ, సీపీఐ ప్రజాపంథా నాయకులు బైఠాయించి బస్సులను అడ్డుకున్నారు. అలాగే సత్తుపల్లి, మధిర ఆర్టీసీ డిపో గేటు ఎదుట అఖిలపక్షం నాయకులు ఆందోళన చేశారు. దీంతో మధ్యాహ్నం వరకు ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కక ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాశారు. ఆటోలు కూడా తిరగకపోవడంతో ఇబ్బంది పడగా, అక్కడక్కడా బయటకు వచ్చిన ఆటోలను నిరసనకారులు అడ్డుకున్నారు. కాగా, మధ్యాహ్నం తర్వాత బస్సుల రాకపోకలు మొదలయ్యాయి.

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రం

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పదేళ్లుగా రైతులు, కార్మికులు, సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయడంతో పాటు కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని నాయకులు ఆరోపించారు. బంద్ సందర్భంగా ఖమ్మం బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన సభలో సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.సాయిబాబు, అఖిలపక్ష పార్టీల నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, భాగం హేమంతరావు, మొక్క శేఖర్‌గౌడ్, గోకినపల్లి వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్, కొత్త సీతారాములు, గాదె లక్ష్మీనారాయణ, సీవై.పుల్లయ్య, ఐ.వెంకన్న మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని విస్మరించడంతో పాటు శ్రామికుల వేతనాలు తగ్గించిందని విమర్శించారు. ఇదేసమయాన కార్పొరేట్లకు 2.14 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేశారని మండిపడ్డారు. సింగరేణి సహా ప్రభుత్వ రంగ సంస్థలను సైతం కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. ఈమేరకు వచ్చేలోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోటు ప్రసాద్, ఎర్ర శ్రీకాంత్, జి.రామయ్య, వై.విక్రమ్, సింగు నర్సింహారావు, యల్లంపల్లి వెంకట్రామయ్య, క్లైమెంట్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన 'సూపర్' సేవలు

- జిల్లా పెద్దాస్పత్రిలో కీలక శస్త్రచికిత్సలు బంద్
- న్యూరో, కార్డియో, మోకీలు చికిత్స లేక బాధితుల ఇక్కట్లు
- నెఫ్రాలజీ వైద్యుడు లేక డయాలసిస్ సేవలపై ప్రభావం
- అత్యవసరమై ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే ఆర్థికభారం



ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జనరల్ ఆస్పత్రికి జిల్లా నుంచే కాక చుట్టుపక్కల జిల్లాల నుంచి నిత్యం 1,500మంది నుంచి 2వేల మంది వరకు వైద్యసేవల కోసం వస్తుంటారు. దీంతో 575 పడకలతో హైదరాబాద్ తర్వాత కీలక ఆస్పత్రిగా ఉండగా.. గత ఏడాది మెడికల్ కళాశాల కూడా ఏర్పాటైంది. ఈమేరకు ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు, డీఆర్‌పీలతో ఆస్పత్రి కళకళలాడుతోంది. ఇదంతా బాగానే ఉన్నా పలు విభాగాల్లో కీలకమైన వైద్యసేవలు మాత్రం కొన్ని నెలలుగా నిలిచిపోయాయి. ప్రధానంగా న్యూరాలజీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, మోకీలు శస్త్ర చికిత్సలు కొంత కాలంగా జరగడం లేదు. ఫలితంగా నిరుపేదలు డబ్బు వెచ్చించి ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేక ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు.

▸ మూడేళ్ల క్రితం పెద్దాస్పత్రిలో న్యూరాలజీ సేవలు అందుబాటులోకి రాగా, ట్రామాకేర్ భవనంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. దీంతో రోగులకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ రోజూ 50 నుండి 70 మంది వరకు ఓపీ సేవలు పొందేవారు. ప్రమాదాల్లో తలకు తీవ్రగాయాలైన వారికి ఇక్కడ మెరుగైన వైద్యం అందుతుండగా, గత ఏడాది సేవలు నిలిచిపోయాయి. కాంట్రాక్ట్ విధానంలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ చైతన్య వేతనాన్ని సగం మేర తగ్గించడంతో రాజీనామా చేయగా ఓపీతో పాటు ఆపరేషన్లు ఆగిపోయాయి.

▸ కార్డియాలజీ సేవలు సైతం అందుబాటులోకి వచ్చి మూడేళ్లు కావొస్తోంది. డాక్టర్ సీతారాం ఆధ్వర్యాన పెద్దాస్పత్రిలో గుండె బాధితులకు మెరుగైన సేవలందాయి. అత్యంత ఖరీదైన క్యాథల్యాబ్ మిషన్ ఏర్పాటుచేయడంతో ఉమ్మడి జిల్లానే కాక చుట్టుపక్కల జిల్లాల గుండె బాధితులు సైతం ఇక్కడకు క్యూ కట్టారు. ఇంతలోనే ప్రభుత్వం డిప్యూటేషన్లను రద్దు చేయటంతో గుండె వైద్య నిపుణుడు సీతారాం సొంత స్థానమైన మంచిర్యాలకు వెళ్లాల్సి వచ్చింది. ప్రత్యామ్నాయంగా ఎవరినీ నియమించకపోవడంతో పదిరోజులుగా ఓపీతో పాటు ఆపరేషన్లు నిలిచిపోయాయి.

▸ పెద్దాస్పత్రిలో కిడ్నీ సంబంధిత సేవలు కూడా కొంతకాలంగా నిలిచాయి. మెడికల్ కళాశాల ఏర్పాటు కాగానే కిడ్నీ వైద్యుడు వేణుగోపాల్‌ను తొలగించారు. ఆతర్వాత ఎవరినీ నియమించకపోవడంతో బాధితులు ప్రైవేట్ బాట పడుతున్నారు. అయితే, నిరుపేదలైన డయాలసిస్ పేషంట్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాగా, డయాలసిస్ కేంద్రాన్ని వైద్యుడు లేకుండానే నిర్వహిస్తుండగా, సేవల్లో లోపాలు ఎదురవుతున్నాయనే ఆరోపణ ఉన్నాయి. ఆరు నెలల కాలంలో అధికారిక లెక్కల ప్రకారమే 40 మంది వరకు మృతి చెందడం ఈ విమర్శలకు బలం చేకూరుస్తోంది.

▸ మోకీలు శస్త్రచికిత్సలు సైతం ఆరు నెలల క్రితం అందుబాటులోకి వచ్చాయి. అట్టహాసంగా సేవలు ప్రారంభించినా అనుకున్న స్థాయిలో శస్త్రచికిత్సలు జరగట్లేదు. ఎంతో ఖరీదైన చికిత్స ఉచితంగా అందుబాటులోకి రాగా, ప్రారంభంలో పది మంది వరకు చికిత్స చేయించుకున్నారు. ప్రస్తుతం మోకీలు శస్త్ర చికిత్సకు ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.2లక్షలకు పైగా ఖర్చవుతుండగా, పెద్దాస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అందాయి. కానీ సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు అందుబాటులో లేక సేవలు నిలిచిపోగా బాధితులు వచ్చి వెనుతిరుగుతున్నారు. ఉన్న ఒకరిద్దరు వైద్యులు ఓపీ చూస్తున్నా శస్త్రచికిత్సలు జరగక ఆరోగ్యశ్రీ ద్వారా వచ్చే నిధులూ నిలిచిపోయాయి.

మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం

పెద్దాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. గుండె వైద్యులు సీతారామ్‌ను డిప్యూటేషన్‌పై తిరిగి తీసుకురావడంపై కలెక్టర్ దృష్టి సారించారు. ఆయన రాగానే కార్డియాలజీ సేవలు పునరుద్ధరిస్తాం. ఇక నెఫ్రాలజీ, న్యూరాలజీ పోస్టులు మంజూరు కాలేదు. అయినా డయాలసిస్ సేవల్లో ఇబ్బంది లేకుండా పర్యవేక్షిస్తున్నాం. అలాగే మోకీలు శస్త్ర చికిత్సలు కూడా పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎల్.కిరణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- ఓట్ల లెక్కింపు కేంద్రంలో పరిశీలన



ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్‌దత్

ఖమ్మంరూరల్: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వీ.పీ. గౌతం సూచించారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలను శుక్రవారం సీపీ సునీల్‌దత్‌తో కలిసి కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల రిసెప్షన్ కేంద్రం, స్ట్రాంగ్‌రూంలు, ఓట్ల లెక్కింపు కేంద్రం శ్రీచైతన్య కళాశాలలో ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తూ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం సీపీ సునీల్‌దత్ భద్రత విషయమై పలు సూచనలు చేశారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, ఖమ్మం, భద్రాద్రి అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్, రాంబాబు, వివిధ శాఖల అధికారులు జి.గణేష్, అశోక్‌చక్రవర్తి, మధు, ఎస్.రాజేశ్వరి, హరికిషన్, శ్రీలత పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు అందించాలి

అదనపు కలెక్టర్ సత్యప్రసాద్



ఏన్కూరు : ఓటరు జాబితాను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

ఖమ్మం సహకారనగర్: బ్యాంకర్లు సకాలంలో రుణాలు మంజూరు చేసి ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాల సాధనకు సహకరించాలని అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023–24 వార్షిక రుణ ప్రణాళికలో ఇప్పటివరకు రూ.2,881 కోట్ల స్వల్పకాలిక పంట రుణాలు మంజూరు చేయగా, మిగతా లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. అంతేకాక రుణాల వసూళ్లపైనా శ్రద్ధ కనబర్చాలన్నారు. అనంతరం సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలు, ప్రాధాన్యత, అప్రధాన్యతా రంగాలు, పాడి, మత్స్య పరిశ్రమల రుణాలపై సమీక్షించారు. ఈసమావేశంలో ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, వివిధ బ్యాంకుల అధికారులు వైభవ్‌వ్యాస్, సుజిత్‌కుమార్, వెంకటేశ్వరరావు, విజయ్‌భాస్కర్‌గౌడ్, సూర్యనారాయణ, రెహమాన్, డీఆర్‌డీఓ సన్యాసయ్య, అధికారులు వేణుమనోహర్, విజయనిర్మల, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ఏన్కూరు: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఏన్కూరు, గార్ల ఒడ్డులోని బూత్‌లను పరిశీలించిన ఆయన ఓటర్ల జాబితా సవరణ, కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రామభక్తుల కల.. సాకారమైన వేళ

- కొత్తగూడెం నుంచి అయోధ్యకు బయలుదేరిన రైలు
- తరలివెళ్లిన 468 మంది భక్తులు
- జై శ్రీరాం నినాదాలతో మార్మోగిన రైల్వే స్టేషన్



గుర్తింపు కార్డులు జారీ చేస్తున్న రైల్వే అధికారులు



ప్రయాణికుల లగేజీ తనిఖీ చేస్తున్న పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: అయోధ్యలో బాలరాముడిని దర్శించుకునేందుకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయడంతో భక్తుల కల నెరవేరినట్టయింది. కొత్తగూడెం(భద్రాచలం రోడ్) స్టేషన్‌కు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఈ రైలు చేరుకోగా, తిరిగి వెళ్లేంతవరకు రైల్వే, సివిల్ పోలీసుల ఆధ్వర్యాన భారీ భద్రత ఏర్పాటుచేశారు. భక్తుల రిజర్వేషన్ ఆధారంగా వివరాలు నమోదు చేసుకుని గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్డు ఉన్నవారిని మాత్రమే రైలు వరకు అనుమతించి బ్యాగ్‌లను తనిఖీ చేశాక రైలు ఎక్కించారు. అయోధ్యకు వెళ్తున్న ప్రత్యేక రైలులో 20 బోగీలు ఉండగా, స్టేషన్ ఆవరణ జై శ్రీరామ్ నామ స్మరణతో మార్మోగింది.

468 మంది ప్రయాణం

భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి అయోధ్య వెళ్లేందుకు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో 484 మంది భక్తులు రిజర్వేషన్ చేయించుకోగా, 468 మంది మాత్రమే బయలుదేరారు. మొత్తంగా 1,696 కిలోమీటర్ల దూరం, 33.30 గంటల ప్రయాణానికి గాను టికెట్ చార్జీ రూ.1,810గా నిర్ణయించారు. రైలు ఎక్కినప్పటి నుంచి బాలరాముడిని దర్శించుకుని తిరిగి వచ్చేంత వరకు భక్తులకు భోజనం సహా అన్ని సౌకర్యాలు ఐఆర్‌టీసీ సమకూర్చనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా 20 మంది సిబ్బందిని నియమించినట్లు అధికారులు తెలిపారు. కాగా ప్రతీ బోగీలో సాయుధులైన పోలీసు భద్రత కల్పించారు. అయితే, వెబ్‌సైట్‌లో సమస్యల కారణంగా ఆసక్తి ఉన్నా టికెట్ బుక్ చేసుకోలేకపోయామని పలువురు భక్తులు వాపోయారు.

వెనుదిరిగిన కుటుంబం

మణుగూరు నుంచి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మహిళలు అయోధ్య వెళ్లేందుకు ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకున్నారు. ఏడేళ్లకు పైగా వయసున్న ఇద్దరు పిల్లలతో కలిసి రైలు ఎక్కేందుకు స్టేషన్‌కు వచ్చారు. అయితే పిల్లలకు టికెట్ బుక్ చేయకపోవడంతో లోపలకు అనుమతించలేదు. దీంతో ఆ కుటుంబం దుఃఖిస్తూ వెనుదిరిగింది.

డీసీసీబీ చైర్మన్‌గా 'దొండపాటి'

- కూరాకులపై అనర్హత వేటుతో వైస్‌చైర్మన్‌కు బాధ్యతలు
- వీవీ.పాలెం చైర్మన్‌గా శ్రీనివాసరావు



దొండపాటి వెంకటేశ్వరరావు

ఖమ్మంవ్యవసాయం/రఘునాథపాలెం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావును చైర్మన్‌గా నియమిస్తూ జిల్లా సహకార అధికారి వి.మురళీధర్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్ కూరాకుల నాగభూషణం రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం పీఏసీఎస్ చైర్మన్‌గానూ ఉండగానే ఆయనపై డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో ఆయన రెండు పదవులను కోల్పోగా డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావును చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన మధిర మండలం ఖమ్మంపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా వ్యవహరిస్తూనే, డీసీసీబీ డైరెక్టర్‌గా ఎన్నికై వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన దొండపాటి శనివారం బాధ్యతలు స్వీకరించనుండగా, డైరెక్టర్ల మద్దతు ఉంటే చైర్మన్‌గా కొనసాగే అవకాశముంది. లేనిపక్షంలో సహకార శాఖ నిబంధనల ప్రకారం షెడ్యూల్ విడుదల చేసి కొత్త చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారు.

వీ.వీ.పాలెం సొసైటీ చైర్మన్‌గా శ్రీనివాసరావు

వీ.వీ.పాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా రావెళ్ల శ్రీనివాసరావును నియమిస్తూ డీసీఓ ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్ నాగభూషణం పదవి కోల్పోయిన నేపథ్యాన వైస్ చైర్మన్ శ్రీనివాసరావుకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. అలాగే, నూతన చైర్మన్ ఎన్నిక కోసం డీసీఓ నోటీసు జారీ చేశారు. ఈనెల 20వ తేదీన సొసైటీ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక నిర్వహించనుండగా, డైరెక్టర్లు హాజరుకావాలని సూచించారు. కాగా, సొసైటీ చైర్మన్‌గా రావూరి సైదబాబును ఎన్నుకోనున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే రాగమయి



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే దంపతులు

సత్తుపల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి – దయానంద్ దంపతులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. అలాగే, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్‌ను సైతం నియోజకవర్గంలో సమస్యల విన్నవించి నిధులు మంజూరుకు ప్రతిపాదనలు సమర్పించారు.

మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభం

కూసుమంచి: స్వయం సహాయక సంఘాల మహిళలకు నాబార్డు సహకారంతో స్వామి వివేకానంద గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన 15 రోజుల పాటు జరగనున్న కుట్టుశిక్షణ శుక్రవారం మొదలైంది. ఈ శిక్షణను కూసుమంచిలో నాబార్డు డీడీఎం సుజిత్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. మహిళలు శిక్షనను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. కాగా, శిక్షణలో పాల్గొనే మహిళలకు రోజుకు రూ.50 చొప్పున చెల్లిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివేకానంద గ్రామీణాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు గోస్మియా, శిక్షకురాలు అభినయశ్రీ, రజిని, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జమలాపురంలో రథసప్తమి వేడుకలు



పాయసం సిద్ధం చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు బెల్లం పాయసాన్ని సిద్ధం చేసి సూర్యభగవానుడికి నివేదించాక భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్‌శర్మ రథసప్తమి విశిష్టతను భక్తులకు వివరించారు. ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, అర్చకులు పాల్గొన్నారు.

ఎరువుల గోదాం తనిఖీ

ఖమ్మంరూరల్: మండలంలోని ముత్తగూడెంలో ఉన్న వర్మీ కంపోస్టు కేంద్రం, ఎరువుల గోదామును డీఏఓ ఎస్.విజయనిర్మల అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్‌తో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా గోదాంలో స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం ఎరువుల కేటాయింపు, రవాణా, రైతులకు పంపిణీ వివరాలనుఅసిస్టెంట్ కలెక్టర్‌కు వివరించారు. ఈకార్యక్రమంలో ఏడీఏ విజయ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రామదీపిక ఇంటి ఎదుట ఆందోళన



గ్రామదీపిక ఇంటి ఎదుట బైఠాయించిన సభ్యులు

కామేపల్లి: మహిళల ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటునివ్వాల్సిన గ్రామదీపికలు వసూలు చేసిన సొమ్మును బ్యాంకులో జమ చేయకుండా సొంతానికి వాడుకుంటున్నారు. ఇదేక్రమంలో కామేపల్లికి చెందిన సిరి గ్రూప్ మహిళా సంఘ సభ్యులకు రుణం ఇప్పిస్తానని చెప్పిన గ్రామదీపిక శీలపాక ఇందిర తొలుత పాత రుణాలు చెల్లించాలని సూచించింది. దీంతో సభ్యులు ఆమెకు రూ.4లక్షల మేర రుణ బకాయిలను డిసెంబర్ 30న చెల్లించారు. ఆతర్వాత కొత్త రుణం ఆరా తీసినా దాట వేస్తుండడంతో ఇటీవల సభ్యులో బ్యాంకుకు వెళ్లి ఖాతా పరిశీలించగా రూ.4లక్షలు జమ చేయలేదని తేలింది. దీంతో సభ్యులు ఇందిరను నిలదీయగా రూ.4 లక్షలు వాడుకున్న విషయాన్ని ఒప్పుకున్నప్పటికీ, తన వద్ద నగదు ఉన్నప్పుడు చెల్లిస్తానని బదులిచ్చింది. ఈమేరకు సభ్యులంతా శుక్రవారం గ్రామదీపిక ఇందిర ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ విషయమై ఏపీఎం సురేందర్‌బాబును వివరణ కోరగా గ్రూప్ సభ్యుల మధ్య వివాదంతో తమకు సంబంధం లేదని తెలిపారు.

పోలీస్ కస్టడీలో ఇంటూరి శేఖర్?

కూసుమంచి: కూసుమంచి మండలంలోని జీళ్ల చెరువు శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాల విషయంలో డీసీసీబీ డైరెక్టర్, చేగొమ్మ పీఏసీఎస్ అధ్యక్షుడు ఇంటూరి శేఖర్‌తో పాటు ఆలయ చైర్మన్ చెన్నా వెంకన్న, డైరెక్టర్లు కొండా వెంకన్న, చింతలపాటి రామకృష్ణను ఇటీవల పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం జిల్లా జైలులో ఉన్న వీరిని రెండు రోజులుగా పోలీసులు తమ కస్టడీకి తీసుకుని న్యాయవాది సమక్షాన విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై కూసుమంచి సీఐ జనార్దన్‌ను వివరణ కోరగా వారికి తాము కస్టడీకి తీసుకోలేదని తెలిపారు.

ఆర్టీసీకి సమ్మెపోటు

- ఉమ్మడి జిల్లాలో డిపోలకే పరిమితమైన బస్సులు
- సర్వీసులు నడవక ఆదాయం కోల్పోయిన సంస్థ
- రీజియన్‌లోని ఏడు డిపోల్లో రూ.60 లక్షల వరకు నష్టం



సమ్మెతో నిర్మానుష్యంగా మారిన వైరా బస్టాండ్

ఖమ్మంమామిళ్లగూడెం/చుంచుపల్లి: సార్వత్రిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ ఆర్టీసీ సంస్థపై తీవ్ర ప్రభావం చూపింది. ఉమ్మడి జిల్లాలో సగం సర్వీసులు డిపోలకే పరిమితమయ్యాయి. రీజియన్‌కు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సమ్మె చేపట్టగా, ఆర్టీసీలో విజయవంతమైంది. కార్మికులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు ఆర్టీసీ డిపోల పరిధిలో మొత్తం 2,100 మంది కార్మికులు ఉండగా, సుమారు 1,300 మంది సమ్మెబాట పట్టారు. తెల్ల వారుజామునే డిపోల వద్దకు చేరుకున్న కార్మికులు, పలు పార్టీల మద్దతుదారులు బస్సులను బయటకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో అధికారులు వివిధ రూట్లకు నడపాల్సిన బస్సులను డిపోల్లోనే నిలిపివేశారు. ఏ డిపోలో కూడా బస్సులు కదల్లేదు. భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం డిపోల్లో అద్దె బస్సుల యజమానులు సమ్మెకు మద్దతు తెలిపారు. తమ సర్వీసులను నిలిపివేశారు. కొందరు సిబ్బంది సాయంత్రం వరకు ఆందోళన కొనసాగించడంతో కొన్ని బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

రోడ్డెక్కింది 217 బస్సులే...

రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో మొత్తం 431 సర్వీసులు ఉండగా, 217 బస్సులు మాత్రమే రోడ్డెక్కాయి. భద్రాచలం డిపోలో 68 బస్సులకు గానూ 48 బస్సులు తిరిగాయి. కొత్తగూడెంలో 52 బస్సులకు 7, మణుగూరులో 56 బస్సులకు 10, ఇల్లెందులో 12 బస్సులకు 9 బస్సులు నడిచాయి. ఖమ్మం డిపోలో 112 బస్సులకు 62, మధిరలో 50 బస్సులకు 18, సత్తుపల్లి డిపోలో 81 బస్సులకు 63 తిరిగాయి. మొత్తం 198 ఆర్టీసీ బస్సులకుగాను 110, హైర్ సర్వీసులు 233కు గాను 107 బస్సులు నడిచాయి. బస్సులు నడవకపోవడంతో ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు, సత్తుపల్లి, మధిర తదితర బస్టాండ్లు ఉదయం వేళ కొంత నిర్మానుష్యంగా కనిపించాయి. ఎనిమిది గంటల తర్వాత ప్రయాణికుల రద్దీ పెరిగినా బస్సుల్లేక గంటలకొద్దీ బస్టాండ్లలో వేచి ఉండాల్సి వచ్చింది. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఉదయం వేళలో కొన్ని బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులు ప్రయత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. దీంతో పలువురు ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు.

పోలీసుల బందోబస్తు..

సమ్మె ప్రభావంతో శుక్రవారం రీజియన్‌లో రూ.60 లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సమ్మె ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రధాన బస్టాండ్ ప్రాంగణాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఖమ్మం డిపో వద్ద ఆర్టీసీ బస్సులను అడ్డుకుంటున్న కార్మిక సంఘాల నాయకులు

మూడు గంటలు బస్టాండ్‌లోనే..



నేను ఉదయం 8 గంటలకు విజయవాడ వెళ్దామని కొత్తగూడెం బస్టాండ్‌కు వచ్చాను. 11 గంటలకు బస్సు రాలేదు. దాదాపు మూడు గంటలపాటు బస్సుల కోసం ఎదురుచూశాను. బంద్ కొద్ది సేపూ మాత్రమే ఉంటుందని భావించి వచ్చాను. కానీ పరిస్థితి అలా లేదు. ఎటు వైపూ బస్సులు వెళ్లడం లేదు.

– ఎం.లక్ష్మి, కొత్తగూడెం

బస్సులు నడపలేకపోయాం...



కార్మికులు శుక్రవారం చేపట్టిన సమ్మె ఆర్టీసీపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఉదయమే కార్మికులు డిపోలకు చేరుకొని బస్సులను బయటకు రానివ్వలేదు. రీజియన్‌లో దాదాపు 75 శాతం మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. అన్ని ప్రధాన రూట్లకు బస్సులను నడపలేకపోయాం. ఏడు డిపోలు రోజువారీ ఆదాయాన్ని భారీగా కోల్పోయాయి.

– సీహెచ్.వెంకన్న, ఖమ్మం రీజినల్ మేనేజర్

పొంగులేటి ఇంట వేడుక

రేపు ప్రసాద్‌రెడ్డి కుమారుడి రిసెప్షన్



వేదిక వద్ద పరిశీలిస్తున్న ఏసీపీ రఘు, తదితరులు



రిసెప్షన్ కోసం వేసిన సెట్టింగ్

కల్లూరు/కల్లూరురూరల్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడైన ప్రసాద్‌రెడ్డి కుమారుడు లోహిత్‌రెడ్డి వివాహం ఇటీవల దుబాయ్‌లో జరగగా.. కల్లూరుకు సమీపాన నారాయణపురం గ్రామంలో రిసెప్షన్ ఆదివారం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సుమారు 70 ఎకరాల స్థలంలో ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుక కోసం ప్రత్యేక వేదిక నిర్మించడంతో పాటు పార్కింగ్‌కు ఏర్పాట్లుచేశారు. ఈ వేడుకకు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు హాజరుకానుండగా, ఇక్కట్లు ఎదురుకాకుండా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వీఐపీలు హాజరుకానున్న నేపథ్యాన పోలీసులు బందోబస్తుపై దృష్టి సారించారు. సుమారు 500 మంది పోలీసు సిబ్బంది పాటు 150 మంది ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. కాగా, కల్లూరు ఏసీపీ ఏ.రఘు శుక్రవారం సాయంత్రం రిసెప్షన్ జరిగే ప్రాంతాన్ని పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై పోలీసు ఉద్యోగులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ ఆధునికీకరణకు నిధులివ్వండి

అసెంబ్లీలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్

వైరా: వైరా రిజర్వాయర్ ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయడంతో పాటు నియోజకవర్గంలో అన్ని చెరువులకు సీతారామ ప్రాజెక్ట్ ద్వారా నీరు అందించేలా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం ఆయన తొలిసారి మాట్లాడే అవకాశం రాగా పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వైరా రిజర్వాయర్ నీటిని సాగు, తాగు అవసరాలకు వినియోగిస్తుండగా, నిత్యం 18 అడుగుల మేర నీటిమట్టం ఉండేలా చూడాలని, కాల్వల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరారు. కొణిజర్ల, ఏన్కూరు మండలాల మీదుగా సాగర్ ప్రధాన కాల్వ వెళ్తున్నందున సాగు నీటి కోసం ప్రత్యేక లిఫ్ట్ ఇరిగేషన్లు ఏర్పాటు చేయాలని, జూలూరుపాడులో 30 పడకల ఆస్పత్రి ద్వారా వైద్యసేవలందేలా చూడాలని, కారేపల్లిలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టడమే కాక వైరాలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టి వ్యవసాయ, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరు చేయాలని, పోడు పట్టాలు అందుకున్న రైతుల భూముల్లో ఐటీడీఏ ద్వారా బోర్లు వేయించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అలాగే, సంత్ సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించడంపై రాష్ట్రప్రభుత్వానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

4 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం?

భద్రాచలంఅర్బన్: ఓ ప్రైవేట్ ట్రావెల్స్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని భద్రాచలం పట్టణంలో శుక్రవారం ఉదయం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి నుంచి హైదరాబాద్ వెళ్తున్న సంగీత ట్రావెల్స్ బస్సులో సుమారు 400 కేజీలు గంజాయిని తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. 8 మంది నిందితులను అదుపులోకి తీసుకోగా, స్థానిక పోలీసులు విచారిస్తున్నారని, పట్టుబడిన వ్యక్తులు హరియాణా రాష్ట్రానికి చెందిన వారని సమాచారం. కాగా ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అధికారికంగా వివరాలు వెల్లడించాల్సి ఉంది.

ఎంపీహెచ్‌డబ్ల్యూఓలో 'ప్రాంగణం' విద్యార్థుల ప్రతిభ

రాష్ట్ర స్థాయిలో 2, 4వ ర్యాంకులు



ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులతో మహిళా ప్రాంగణం అధికారి విజేత

ఖమ్మం అర్బన్: మహిళా ప్రాంగణాల్లో కొన్నేళ్ల క్రితం వరకు మహిళలకు కుట్లు అల్లికలు, కంప్యూటర్ శిక్షణ మాత్రమే ఇవ్వగా 2023 నుండి ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా రెండేళ్ల ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు ప్రవేశపెట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అభ్యర్థులు ఖమ్మంలోని మహిళా ప్రాంగణంలో ప్రవేశాలు పొందగా ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి బ్యాచ్ విద్యార్థుల ప్రథమ సంవత్సరం ఫలితాలు తాజాగా వెల్లడయ్యాయి. ఈమేరకు ఖమ్మంకు చెందిన బైరం రచన, సలవాడి మనీల రాష్ట్రస్థాయిలో రెండు, నాలుగో ర్యాంకులు సాధించారని మహిళా ప్రాంగణం అధికారి వేల్పుల విజేత తెలిపారు. జిల్లా స్థాయిలోనూ మొదటి పది ర్యాంకులు తమ విద్యార్థులే సాధించారని వెల్లడించారు.

ఉపాధి అవకాశాలను అందుకోవాలి

అశ్వారావుపేటరూరల్: ఎస్టీ, ఎస్సీ యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి చేరాలని భద్రాద్రి జిల్లా ఉపాధి కల్పనా అధికారిణి వి.విజేత సూచించారు. అశ్వారావుపేటలో తెలంగాణ రాష్ట్ర ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యాన మహిళలకు శనివారం ఇచ్చిన నైపుణ్య శిక్షణను ఆమె పరిశీలించి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు, యువతులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. కోఆర్డినేటర్ సత్యం, శిక్షణ నిర్వాహకులు సత్యం, సిబ్బంది పాల్గొన్నారు.

తేమ ప్రామాణికంగా మిర్చి కొనుగోళ్లు

- 1,300 టన్నుల కొనుగోళ్లకు ముందుకొచ్చిన బయ్యర్లు
- నేరుగా కల్లాల వద్దే కొనుగోలుతో రైతులకు తగ్గనున్న భారం



రైతులు తీసుకొచ్చిన మిర్చి శాంపిళ్లను పరిశీలిస్తున్న వ్యాపారులు

ఖమ్మంవ్యవసాయం: తేమ ప్రామాణికంగా మిర్చి కొనుగోలు చేసేందుకు వివిధ కంపెనీల బాధ్యులు ముందుకొచ్చారు. సాగు – బాగు కార్యక్రమంలో భాగంగా డిజిటల్ గ్రీన్ సంస్థ శుక్రవారం ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల స్థాయి క్రయవిక్రయదారుల సమావేశాన్ని ఖమ్మంలో నిర్వహించింది. ఈ సమావేశంలో 90మంది మిర్చి రైతులు శాంపిళ్లు తీసుకురాగా, 25 కొనుగోలు సంస్థల వ్యాపారులతో పాటు రెండు జిల్లాలకు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిర్చి శాంపిళ్లను వ్యాపారులు పరిశీలించి 1,300 మెట్రిక్ టన్నుల మిర్చి కొనుగోలుకు ముందుకొచ్చారు. రైతుల కల్లాల వద్దే తేమ శాతం ఆధారంగా ధర నిర్ణయిస్తామని, రైతులపై రవాణా, ఇతర చార్జీలు పడవని తెలిపారు. రెండు రోజుల్లో ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో మిర్చి కొనుగోళ్లు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల మాట్లాడుతూ రైతులు మిర్చి కోశాక అవసరమైన మేరకు ఆరబెట్టి తాలు, నాసిరకం కాయ వేరు చేస్తే మంచి ధర లభిస్తుందని తెలిపారు. ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జి.అనసూయ, మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం, మహబూబాబాద్ ఏడీఏ శోభన్, నాబార్డ్ డీజీఎం సుజిత్, అధికారులు రమణ, విజయ్‌చందర్, నరేంద్ర, జ్యోతి, యశోద, మస్తాన్, కమల్, సురేందర్, వెంకట్, సుధ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ముగిసిన సెమినార్



సెమినార్‌లో మాట్లాడుతున్న ఓఎస్‌డీ యశోలత

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్‌లో ఉన్న గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా సామాజిక స్థితిగతులపై నిర్వహిస్తున్న సెమినార్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా వివిధ యూనివర్సిటీల నుండి హాజరైన ప్రొఫెసర్లు విద్యార్థులకు సామాజిక విలువలు, ఉన్నత చదువులు, ఉద్యోగ, ఆర్థిక స్థిగతులకు దోహదపడే అంశాలపై అవగాహన కల్పించారు. చివరి రోజు గురుకుల డిగ్రీ కళాశాలల ఓఎస్‌డీ డాక్టర్ ఆర్.యశోలత మాట్లాడగా, గురుకుల డిగ్రీ కళాశాలల జాయింట్ సెక్రటరీ డాక్టర్ జి.నిరూప, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఝాన్సీరాణి, ప్రొఫెసర్లు డాక్టర్ చందూలాల్, డాక్టర్ జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేపల మేత తయారీపై అవగాహన అవసరం

కూసుమంచి: మత్స్యకారులకు చేపల మేత తయారీపై అవగాహన ఉండాలని, తద్వారా చేపలకు నాణ్యమైన ఆహారం అందించవచ్చని పాలేరులోని శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. 'దేశవాళీ తెల్లచేపల పెంపకం' అంశంపై మత్స్యకారులకు ఇస్తున్న శిక్షణ శుక్రవారం రెండో రోజుకు చేరగా ఆయన మాట్లాడారు. చేపల రకాల ఆధారంగా మేత తయారు చేయాలని సూచించారు. ఈ శిక్షణలో ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ జిల్లాల చెందిన మత్స్యకారులు పాల్గొనగా శాస్త్రవేత్త రవీందర్ పలు సూచనలు చేశారు.



చేపల రకాలను వివరిస్తున్న శాస్త్రవేత్తలు

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

- వ్యక్తిపై దాడి చేసిన వారిపై కేసు
- ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి

ఖమ్మంరూరల్: మండలంలోని గుదిమళ్లలో గురువారం రాత్రి మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శివరాంసింగ్‌పై దాడి చేసిన గ్రామానికి చెందిన దోమల వెంకటేష్, మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ శివరాంసింగ్ ముదిగొండ మండలం పండ్రేగుపల్లిలోని క్రషింగ్ మిల్లులో పనిచేస్తూ ఖమ్మం వెళ్లి వస్తుండగా, ఆటోడ్రైవర్ పొరపాటున గుదిమళ్లలో దించాడని తెలిపారు. దీంతో శివరాంసింగ్ హిందీ భాషలో చిరునామా ఆరా తీస్తుండగా, స్థానికులు అనుమానంతో దాడి చేశారని పేర్కొన్నారు. కాగా, శివరాంసింగ్‌పై దాడి చేసిన దోమల వెంకటేష్ మరికొందరిపై విచారణ సాగుతోందని త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు. అనుమానితులు కనిపిస్తే పోలీసులు సమాచారం ఇవ్వాలే తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని ఏసీపీ సూచించారు. అలాగే, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మొద్దని కోరారు.

పోచారంలో అలజడి

కూసుమంచి: మండలంలోని పెద్ద పోచారంలో ఇతర రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి కనిపించగా పిల్లలను ఎత్తుకెళ్లేందుకు వచ్చాడనే అనుమానంతో స్థానికులు నిలదీశారు. అయితే, సదరు వ్యక్తికి తెలుగు రాకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు చేరుకుని ఆయనను స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన సదరు వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి గ్రామాలు తిరుగుతున్నట్లు గుర్తించగా, మిర్చి కోతలకు వచ్చిన ఆయన బంధువులకు అప్పగించామని ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

అంత్యక్రియల్లో అపశృతి

టపాసులు దూసుకెళ్లడంతో వరిగడ్డి వాములు దగ్ధం

పెనుబల్లి: ఓ వృద్ధురాలి అంతిమయాత్రలో పేలుస్తున్న టపాసులు ప్రమాదవశాత్తు వరి గడ్డివాములో దగ్ధమైన ఘటన చోటు చేసుకుంది. పెనుబల్లికి చెందిన వృద్ధురాలు మృతి చెందగా శుక్రవారం అంత్యక్రియలకు తీసుకెళ్తున్న సమయాన టపాసులు పేల్చారు. ఇవి గాలిలోకి వెళ్లి గ్రామానికి చెందిన గోదా చెన్నారావు వరిగడ్డి వాముపై పడడంతో భారీగా మంటలు చెలరేగాయి. చెన్నారావుకు చెందిన ఆరెకరాల గడ్డివాముతో పాటు పక్కనే మరో రైతు గడ్డివాముకు మంటలు అంటుకుని పూర్తిగా కాలిపోయా. ఈ సమయాన బాధితులు ఇంట్లో లేకపోవడంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే, అప్పటికే గడ్డి పూర్తిగా కాలిపోవడంతో బాధితులు కన్నీరుమున్నీరయ్యారు.

డిగ్రీ విద్యార్థి మృతి

కామేపల్లి: వాంతుల కారణంగా అస్వస్థతకు గురైన ఓ విద్యార్థి మృతి చెందాడు. మండలంలోని పింజరమడుగు తండాకు కేలోత్ మురళి(22) డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఆయనకు ఉదయం నుంచి వాంతులు అవుతుండగా అస్వస్థకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యం అందిస్తుండగానే పరిస్థితి విషమించి మృతి చెందాడు.

జాతరకు వెళ్తూ ప్రమాదంలో మహిళ...

కూసుమంచి: మేడారం జాతరకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. మండలంలోని జీళ్లచెరువు గ్రామానికి చెందిన ముద్రబోయిన ఉమ(35) బంధువులతో కలిసి వాహనంలో గురువారం రాత్రి మేడారం బయలుదేరింది. ఈమేరకు మార్గమధ్యలో మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం చింతపల్లి గ్రామ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంపై ఫిర్యాదు


ఖమ్మం అర్బన్: ఖమ్మం మమతరోడ్డులో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో శుక్రవారం ఖానాపురం హవేలీ పోలీసులు ఫిర్యాదు చేశారు. ఖమ్మం ముస్తఫానగర్‌కు చెందిన ఆత్మకూరి పవన్‌కుమార్ గురువారం రాత్రి మమత రోడ్ మీదుగా ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా, అశోక్ లేల్యాండ్ వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో పవన్ గాయపడగా, ఆయన ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థిని అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని శుక్రవారం అదృశ్యమైంది. ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం .. మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని, స్థానిక ఓ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఉదయం పాఠశాలకు వెళ్లిన కొద్ది సేపటికే కడుపులో నొప్పి వస్తుందని, తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. అనంతరం తన స్నేహితురాలి అన్నయ్య ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరింది. మార్గంమధ్యలో గ్రామస్తులు కలవడంతో వారితో వెళ్తానంటూ చెప్పి బైక్ దిగిపోయింది. సాయంత్రానికి కూడా ఇంటికి రాకపోవడంతో విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
ఖమ్మం ॥ శనివారం
17-2-2024

మన శరీరంలో పేరుకుపోయే వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు పంపించేందుకు కిడ్నీలు ఎప్పుడూ శ్రమిస్తూనే ఉంటాయి. అందుకుగాను మనం తగినంత నీటిని తాగడంతోపాటు కిడ్నీలను సురక్షితంగా ఉంచే ఆహారాలను తీసుకోవాలి. అయితే కొందరిలో పలు కారణాల వల్ల కిడ్నీ సమస్యలు వస్తుంటాయి. ఈ క్రమంలోనే వారిలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేమిటో తెలుసుకుంటే ముందే జాగ్రత్త పడవచ్చు. ఆ లక్షణాలేమిటో తెలుసుకుందాం.



మీ కిడ్నీలు కుశలమేనా?

తరచూ మూత్రానికి వెళ్లాల్సి వస్తే దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి. అయితే డయాబెటిస్ ఉన్నవారిలో సహజంగానే ఇలా జరుగుతుంది. కనుక ఆ వ్యాధి ఉందో, లేదో చెక్ చేయించుకోవాలి. ఒకవేళ డయాబెటిస్ లేకపోయినా మాటిమాటికీ మూత్రానికి వెళ్లాల్సి వస్తుందంటే.. దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి.

● కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో ముఖం అంతా వాపులకు గురై ఉబ్బిపోయి కనిపిస్తుంది. కాలి మడమలు, కాళ్లు, పాదాలు, చేతులు ఉబ్బిపోయి కనిపిస్తాయి ● కిడ్నీ సమస్యలు ఉంటే తీవ్రమైన అలసట వస్తుంది. కొందరిలో రక్తహీనత సమస్య కూడా ఏర్పడుతుంది ● చర్మం పొడిగా మారి దురదలు పెడుతుంది ● నోటి దుర్వాసన ఉంటుంది ● కిడ్నీ సమస్యలు ఉంటే కొందరిలో జ్ఞాపకశక్తి తగ్గుతుంది. కొందరికి తల తిరిగినట్లు అనిపిస్తుంది ● కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో వెన్ను నొప్పి వస్తుంటుంది ● వాంతి వచ్చినట్టుగా... వికారంగా అనిపిస్తుంది ● కిడ్నీ సమస్యలు ఉంటే శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది ● కిడ్నీ సమస్యలు ఉన్నవారు వేడి వాతావరణంలో ఉన్నప్పటికీ చలిగా అనిపిస్తుంది. కొందరు వణుకుతారు.

టపైన తెలిపిన లక్షణాలు కనుక ఎవరిలో అయినా ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి వారి సలహా మేరకు సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి. అవసరం అయితే మందులను వాడాల్సి ఉంటుంది. దీంతో పాటు కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచే ఆహారాలను తినాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

వెడ్డింగ్ ప్లాన్

సింపుల్‌గా... సూపర్‌గా..!

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. అంటే మన సమాజంలో ఈ రెండు విషయాలూ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న విషయాలన్నమాట. ఎందుకంటే ఒకవైపు ఖర్చు ఎంత పెట్టినా ఇంకా పెట్టాలేమో అన్నట్లుగా ఉంటుంది. ఎక్కడ పెంచాలో.. ఎక్కడ తగ్గించుకోవాలో అర్థం కాదు.. సరైన ప్లానింగ్ లేకపోతే అంతా గందరగోళమే. చివరికి తడిసి మోపడమవడం ఖాయం. తీరా అంత ఖర్చు పెట్టాక మనసుకు సంతృప్తి లేకపోతే మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకే పెళ్లి విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరం.



భారతీయ సంప్రదాయంలో పెళ్లికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. కన్యాదాత ఎంతో హంగు, ఆర్భాటాలతో పెళ్లి చేస్తాడు. ఒకోసారి వరుడి తరపు వారే పెళ్లి ఖర్చులు పెట్టుకోవడం, లేదా ఖర్చును ఇద్దరూ కలిసి పంచుకోవడం... ఏ రకంగా చూసినా సరే, జీవితంలో ఒక్కసారే జరిగే సంబరం కావడంతో ఖర్చుకు ఎక్కడా వెనుకాడరు. పెళ్లి శుభలేఖ దగ్గర నుంచి.. మండపాలంకరణ వరకు, పెళ్లిబట్టల నుంచి నగల వరకు; టిఫిన్ల దగ్గర నుంచి విందు భోజనాల వరకు... ఇలా ప్రతిదీ ఖర్చుతో కూడుకున్నదే. భారతీయులు సగటున పెళ్లికోసం చేస్తున్న ఖర్చు రూ. 5 లక్షల నుంచి రూ. కోటికి పైగా ఉంటుందన్నది ఒక అంచనా.

ఇల్లలకగానే పండగా... అన్నట్లు ఉన్నదంతా వదిలించుకుని లేదా లేకపోతే అప్పులు చేసి మరీ పెళ్లి చేసిన తర్వాత ఆ జంట కాపురం కోసం మరి కొంత ఖర్చు చేయాల్సి వస్తుంది. ఏది తక్కువైనా నవ్వుల పాలు కావడం ఖాయం. అయితే వైభవంగా పెళ్లి చేయడం వరకు తప్పేం లేదు కానీ స్తోమతకు మించి అప్పులు చేయడంలోనే అభ్యంతరం... తప్పనిసరి వాటికి ఎలాగూ ఖర్చు తప్పదు కానీ కాస్త ఆచి తూచి ప్లాన్ ప్రకారం చేస్తే పెళ్లికి అయ్యే వృథా ఖర్చును కొంత తగ్గించవచ్చు. అదెలాగో చూద్దాం...





ముందస్తు ప్రణాళిక ...

పెళ్లి ఎంత గ్రాండ్ గా చేశాం అనే దానికన్నా ఎంత ప్రణాళికాబద్ధంగా ఆర్గనైజ్ చేశామన్నది ముఖ్యం. అనుకున్న బడ్జెట్ లోపు చేయాలంటే ఖర్చు ఎక్కడ పెట్టాలి.. ఎక్కడ తగ్గించుకోవాలో ముందుగానే నిర్ణయించుకోవాలి. ఇందుకోసం పెళ్లి తంతులో వివిధ ఘట్టాలకు అవసరమైన వస్తు సామగ్రిని ముందుగానే జాబితా రాసుకోవాలి. అవసరమైతే మండపం, అలంకరణ, కేటరింగ్ వంటి వాటిని ఒకరికే కాంట్రాక్ట్ ఇస్తే కొంతమేరకు ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే పర్యవేక్షణ కూడా బావుంటుంది. వస్త్రాలు, నగలు కూడా అవసరం మేరకే కొనుగోలు చేయాలి.

అతిథుల జాబితా అన్నింటికన్నా ముఖ్యం...

పెళ్లి అంటేనే సకుటుంబ సపరివారంతోపాటు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అంతా హాజరు కావాలని అందరూ కోరుకుంటారు. అందుకోసం బంధువులకు ఒకటని, మిత్రులకు మరొకటని కార్డులు ప్రింట్ చేయిస్తుంటారు. ఇక్కడ కూడా ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంటుంది. అందరికీ కామన్‌గా ఒకే ఆహ్వాన పత్రిక ఉంటే ఖర్చు తగ్గుతుంది. సేహితులకు కార్డులు కొట్టించే బదులు ఈ ఇన్విటేషన్ల ద్వారా కూడా ఆహ్వానం పంపుకోవచ్చు. అలాగే పెళ్లిలో మెహందీ అని, సంగీత్ అని, హల్దీ అనీ, రిసెప్షన్ అనీ ఇలా చాలా రకాల ఈవెంట్స్ చేస్తున్నారు. పెళ్లికూతురు దగ్గర కొన్ని, పెళ్లి కొడుకు వద్ద మరికొన్ని.. ఇద్దరిని కలిపి కొన్ని ఈవెంట్స్ ప్లాన్ చేస్తున్నారు. వీటికి ఎవరెవరిని పిలవాలనే దానిపై కూడా కసరత్తు చేయాలి. అప్పుడు ఏ ఈవెంట్ కు ఎంతమంది వసారో అవగాహన ఉంటుంది కాబట్టి.. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలి.

ముందుగా బడ్జెట్ వేసుకోండి...

పెళ్లికి ముందు బడ్జెట్ సిద్ధం చేసుకోవాలి. బడ్జెట్ లేకుండా వెడ్డింగ్ ఫంక్షన్ నిర్వహిస్తే ఖర్చులు భారీగా ఉంటాయి. మీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ సిద్ధం చేసుకోవడం మొదటి పని. వివాహం అలా చేసుకోవాలని ఇలా చేసుకోవాలని చాలా కోరికలు ఉంటాయి. కానీ అవసరమైన వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని గుర్తుంచుకోండి. ఉదాహరణకు వివాహానికి బట్టలు, ఆభరణాలు అవసరం. అలాగని ఖరీదైన బట్టలు, ఆభరణాలు అవసరం లేదు. బడ్జెట్‌లో వచ్చే వాటిని తీసుకోవడం ఉత్తమం.

క్యాటరింగ్:

పెళ్లి విందులకు డబ్బు గుడ్డిగా ఖర్చు చేస్తారు. చాలా పెళ్లిళ్లలో ఆహారం వృథా అవడం గమనిస్తూనే ఉంటాం. వివాహ విందు మెనులో అవసరమైన ఆహార పదార్థాలను మాత్రమే చేర్చండి. లేనిపోని గొప్పల కోసం మెనూని పెంచవద్దు. హాజరయ్యే అతిథుల సంఖ్యకు అనుగుణంగా క్యాటరింగ్ సిద్ధం చేసుకోవాలి.

అలంకరణ సామగ్రి





పెళ్లి ఇంట్లో చాలా అలంకరణ ఉంటుంది. అవసరమైన అలంకరణ వస్తువులు మాత్రమే తీసుకోవాలి. వీటిలో పువ్వులు చాలా ముఖ్యమైనవి. వాటిని చౌకగా ఉన్న ప్రదేశాల నుంచి కొనుగోలు చేస్తే కొంత డబ్బు ఆదా అవుతుంది.

హనీమూన్ ట్రిప్...

పెళ్లితంతు ముగిసిన తర్వాత నూతన వధూవరుల హనీమూన్ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. హనీమూన్ డెస్టినేషన్లుగా పేరుగాంచిన దేశాలకు ఎగిరిపోతున్నారు. ఇది కూడా బడ్జెట్ పెరగడానికి కారణం అవుతుంది. దీని బదులుగా మన దేశంలోనే అనువైన ప్రాంతాలను ఎంచుకుంటే చాలా సమయంతో పాటు ధనమూ ఆదా అవుతుంది. ఒకవేళ విదేశాలకే వెళ్లాలనుకుంటే తక్కువ ఖర్చుతో వెళ్లి రాగలిగే మలేసియా, థాయ్‌ల్యాండ్ వంటివి ఎంచుకుంటే సరిపోతుంది.

లైఫ్@360




శరీరంలో స్రవించే హార్మోన్లలో ఒక్కోసారి చోటు చేసుకునే కొన్ని రకాల అసమతౌల్యతల కారణంగా చాలా ఒత్తిడికి లోనవుతుండటం లేదా మూడ్ ఆఫ్ కావడం మామూలే. అయితే దాన్ని సరిచేయడానికి మందులు మింగే బదులు కొన్ని ఆహారాలను తీసుకోవడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యాలు దృఢంగా ఉంటాయి. ఆ ఆహారాలేమిటో తెలుసుకుని, మూడ్ బాగుండనప్పుడు వాటిని తీసుకుంటే సరి!

మూడ్‌ని మార్చే ఫుడ్

ఒక్కొక్కసారి మనకు తెలియకుండానే మూడ్ పాడవుతుంది. ఏదో పోగొట్టుకున్నట్లు... వెలితిగా... ఒకలాంటి బాధగా అనిపిస్తుంది. అలాంటప్పుడు కొన్నిరకాల ఆహారాలను తీసుకోవడం వల్ల వెంటనే మూడ్ సరవుతుంది. అవేమిటో తెలుసుకుందాం...



పాలకూర.. ఐరన్ పాళ్లు అధికంగా ఉండే పాలకూర సంతోషకరమైన హార్మోన్లను పెంచడానికి పనిచేస్తుంది. అంతేకాదు, ఇందులో ఫైబర్, విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థకు, చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. పాలకూర స్మూతీ, సూప్ లేదా పాలకూరను ఏదో ఒక రూపంలో ఆహారంలో తీసుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది.



మష్రూమ్స్.. మష్రూమ్స్ యాంటి డిప్రెసెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇందులో సమృద్ధిగా ఉండే విటమిన్ డి మానసిక స్థితిని నియంత్రిస్తుంది. ఇది సెరటోనిన్ సంశ్లేషణ స్థాయికి సంబంధించినది. దీని కారణంగా వ్యక్తి సంతోషకరమైన భావోద్వేగాలను అనుభవించగలడు. మీ మూడ్ ఆఫ్‌లో ఉన్నప్పుడు, మష్రూమ్ రెసిపీని తినడం వల్ల తిరిగి మంచి మూడ్‌లోకి వచ్చేసే అవకాశం మెండుగా ఉంది. ప్రయోజనకరంగా ఉంటుంది.

అవకాడో.. కొద్దికాలం క్రితం నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం అవకాడోలో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ఉండే విటమిన్ బి3 ,ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు సంతోషకరమైన హార్మోన్ అయిన సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడతాయి. రోజంతా సంతోషంగా ఉండటానికి సలాడ్, శాండ్‌విచ్ లేదా అల్పాహారంలో అవకాడోను చేర్చవచ్చు.



డ్రై ఫ్రూట్స్.. ప్రతిరోజూ కొన్ని బాదం లేదా వాల్‌నట్‌లను తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది, ఒత్తిడి తగ్గుతుంది. డ్రై ఫ్రూట్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల ఇలా జరుగుతుంది.

డార్క్ చాకొలేట్.. ఓ నివేదిక ప్రకారం డార్క్ చాకొలేట్ తినడం వల్ల శరీరంలో సంతోషకరమైన హార్మోన్ల స్థాయి పెరుగుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. ఇందులో ఉండే ట్రిప్టోఫాన్ సెరోటోనిన్ స్థాయులను పెంచుతుంది. ఫలితంగా వెంటనే మూడ్ సరవుతుంది.



మూడ్ బాగుండనప్పుడు ఈ ఫుడ్ ప్రయత్నించండి.

సినిమా

దేవర డేట్ ఫిక్స్


● ఎన్టీఆర్

రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్నాడు 'దేవర'. ఈ ఏడాది అక్టోబరు 10న 'దేవర' చిత్రం తొలి భాగం విడుదల కానుంది. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబోలో వస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. నందమూరి కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. కాగా తొలి భాగాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ వాయిదా వేశారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో అక్టోబరు 10న సినిమాని విడుదల చేయనున్నట్లు శుక్రవారం వెల్లడించారు మేకర్స్.

ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం


● రాజేంద్రప్రసాద్, జయప్రద

'ఈ ప్రపంచం మన ప్రేమని తిరస్కరిస్తే.. ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం' (రాజేంద్ర ప్రసాద్), 'అందరూ నన్ను ఏడిపించినవాళ్లే.. కానీ, నాకోసం ఏడ్చింది నువ్వు ఒక్కడివే' (జయప్రద) వంటి డైలాగులు 'లవ్ @65' మూవీ ట్రైలర్‌లో ఉన్నాయి. రాజేంద్ర ప్రసాద్, జయప్రద ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లవ్ @65'. వీఎస్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కార్తీక్ రాజు, స్పందన పల్లి ముఖ్య పాత్రలు పోషించగా, సునీల్, అజయ్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానున్న సందర్భంగా శుక్రవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. 'రాత్రి ఇక్కడి నుంచి ఇద్దరు మిస్ అయిపోయారు సార్', 'ఎవరు', 'మా కావేరి సార్.. మా ఆది సార్', 'ఎలా మిస్సయ్యారు', 'వాళ్లు లేచిపోయారు సార్', 'ఇద్దరూ మేజర్లా', 'కాదు సార్.. ఆయనకి డెబ్బై నిండాయి.. ఆవిడకి ఓ అరవైఐదు దాక ఉంటాయి'.. వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ తుమ్మలపల్లి, సంగీతం: అనూప్ రూబెన్స్.

అన్యాయంపై పోరాటం


● అనుష్క

'అరుంధతి', 'భాగమతి'.. ఇలా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో తనదైన శైలిని చాటుకుని సక్సెస్ అయ్యారు అనుష్క. తాజాగా ఆమె కథానాయిక ప్రాధాన్యంగా సాగే మరో సినిమా అంగీకరించారు. క్రిష్ (జాగర్లమూడి రాధాకృష్ణ) ఈ సినిమాకు దర్శకుడు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఒడిశాలోని ఒక మహిళ జీవితంలో పదేళ్ల క్రితం జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందుతోందని సమాచారం. తనకు జరిగిన అన్యాయంపై పోరాటం చేసే ఓ సాధారణ అమ్మాయిగా అనుష్క పాత్ర ఉంటుందట. ఇటీవల ఒడిస్సాలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుపుతున్నారని తెలిసింది. కాగా ఈ సినిమాకు 'శీలవతి' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తోందనే టాక్ వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాలో తమిళ నటుడు విక్రమ్ ప్రభు ఓ లీడ్ రోల్ చేస్తున్నారని, ఈ సినిమా ఈ ఏడాదే దక్షిణాది భాషల్లో విడుదలవుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

మహారాజా?


● మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్ర కోసం ఇండోనేషియా బ్యూటీ చెల్సియా ఇస్లాన్, దీపికా పదుకోన్ పేర్లు తెరపైకి వచ్చాయి. ఫారెస్ట్ అడ్వెంచరస్ ఫిల్మ్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'మహారాజా', 'మహారాజ్', 'చక్రవర్తి' అనే టైటిల్స్‌ను పరిశీలిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. మరి.. ఫైనల్‌గా ఈ టైటిల్స్‌లో ఏదో ఒకటి ఫిక్స్ అవుతుందా? లేక మరొక టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేస్తారా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. ఇక విజయేంద్రప్రసాద్ కథ అందించిన ఈ చిత్రానికి ఎమ్ఎమ్ కీరవాణి సంగీతదర్శకుడు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది వేసవిలో ఆరంభమవుతుందని టాక్.

మళ్లీ వస్తున్నాడు జోకర్


● 'జోకర్ 2' పోస్టర్

హాలీవుడ్ జోకర్ మళ్లీ వస్తున్నాడు. హాలీవుడ్ మ్యూజికల్ సైకలాజికల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'జోకర్'. జోక్విన్ ఫీనిక్స్ ప్రధాన పాత్రలో టాడ్ ఫిలిప్స్ డైరెక్షన్‌లో రూపొందిన ఈ సినిమా 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ' సినిమాకు సీక్వెల్‌గా 'జోకర్ 2' (జోకర్: ఫోలీ ఎ డ్యూక్స్)ను ప్రకటించారు టాడ్ ఫిలిప్స్. ఈ చిత్రంలో జోక్విన్ ఫీనిక్స్‌తో పాటు లేడీ గగా మరో లీడ్ రోల్ చేస్తున్నారు. జాజై బీట్జ్ మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారు. లాస్ ఏంజిల్స్, న్యూయార్క్, న్యూ జెర్సీ లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిపారు. ఈ చిత్రం ట్రైలర్ ఏప్రిల్ 4న విడుదల కానుం దని హాలీవుడ్ టాక్. సినిమాను ఈ ఏడాది అక్టోబరు 4న విడుదల చేయాలనుకుంటున్నారు. టాడ్ ఫిలిప్స్, బ్రాడ్లీ కూపర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా వార్నర్ బ్రదర్స్ డిస్ట్రిబ్యూట్ చేయనుంది.

థ్రిల్ స్టార్ట్


● మోహన్ భగత్

మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆరంభం'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో వీటీ అభిషేక్ నిర్మిస్తున్న సినిమా ఇది. ఈ సినిమా టీజర్‌ను హీరో నాగచైతన్య విడుదల చేసి, 'బ్యాగ్రౌండ్‌లో రామాయణ స్టోరీని నరేట్ చేస్తూ ఇంటర్‌కట్స్‌లో వేసిన విజువల్స్‌తో టీజర్‌ని డిఫరెంట్‌గా కట్ చేశారు. థ్రిల్లింగ్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఆసక్తిగా ఉంది'' అన్నారు.

యుద్ధానికి సిద్ధం!


● హృతిక్ రోషన్

బాలీవుడ్‌లో మరో వార్‌కు సిద్ధం అవుతున్నారు హీరో హృతిక్ రోషన్. ఆయన నటిస్తున్న యాక్షన్ స్పై ఫిల్మ్ 'వార్ 2'. ఎన్టీఆర్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ నెలాఖర్లో ప్రారంభం కానుంది. హృతిక్ రోషన్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట అయాన్ ముఖర్జీ. ఈ చిత్రం 2025 ఆగస్టు 14న విడుదల కానుంది. 2019లో హృతిక్, టైగర్ ష్రాఫ్‌లు నటించిన 'వార్' సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' వస్తోంది.

రీల్స్

పెళ్లనేది పాన్ ఇండియా సమస్య


● 'అల్లరి' నరేశ్

'ఆ ఒక్కటీ అడక్కు' అంటున్నారు హీరో 'అల్లరి' నరేశ్. ఆయన నటిస్తున్న 61వ చిత్రానికి నూతన దర్శకుడు మల్లి అంకం దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ఫరియా అబ్దుల్లా హీరోయిన్. రాజీవ్ చిలక నిర్మిస్తున్న ఈ సినిమాకి 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్ గ్లింప్స్ విడుదల చేశారు. ఈ మూవీలో నరేశ్ పాత్ర పేరు గణ. అతని పెళ్లి గురించి కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు అడిగితే.. 'ఆ ఒక్కటీ అడక్కు.. పెళ్లనేది పాన్ ఇండియా సమస్య' అంటూ నరేశ్ చెప్పే డైలాగ్స్ గ్లింప్స్‌లో ఉన్నాయి. ''వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది. మార్చి 22న విడుదల చేస్తాం'' అన్నారు మేకర్స్.

గ్రామీణ నేపథ్యంలో...


● యువ చంద్రకృష్ణ

యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె నిర్మించిన ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'వవ్వారే..' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ''గ్రామీణ నేపథ్యంలో కొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'పొట్టేల్'. ఈ చిత్రంలోని భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సందె వేళ...


● శాంతి చంద్ర, దీపికా సింగ్

శాంతి చంద్ర హీరోగా, దీపికా సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రితి హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'డర్టీ ఫెలో'. ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో గూడూరు భద్రకాళి సమర్పణలో జీయస్ బాబు నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. డా. సతీష్ కుమార్ పి. సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సందె వేళ...' అంటూ సాగే పాటని డైరెక్టర్ సాయి రాజేశ్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''నా మిత్రుడు శాంతి చంద్ర నటించిన 'డర్టీ ఫెలో'లోని 'సందె వేళ..' పాట బాగుంది'' అన్నారు. ''వినూత్న కథతో రూపొందిన చిత్రమిది'' అన్నారు శాంతిచంద్ర.

ప్రేమ.. నవ్వులు


● గౌతమ్, పరశురామ్

గౌతమ్ సాగి, దీప్శికా జంటగా చంద్రశేఖర్ కానూరి దర్శకత్వంలో శ్రీధర్ వర్మ సాగి నిర్మిస్తున్న చిత్రం 'రవికుల రఘురామ'. సుకుమార్ పమ్మి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చందమామే..' అంటూ సాగే పాటని డైరెక్టర్ పరశురామ్ విడుదల చేశారు. ''లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ప్రేక్షకులకు మంచి వినోదాన్ని ఇవ్వాలని తన సృజనాత్మకత మొత్తం జోడించి ప్రాణం పోస్తున్నారు చంద్రశేఖర్'' అని యూనిట్ పేర్కొంది.